# కామదహనం

ఎన్నికలూ హోలీ కలిసిరావటం యింతకుముందు నే నెరగను.

ఈసారే ఇలా ఇవి కలిసివచ్చాయి.

ఎన్నికల సంరంభంలో పన్నెండు రాష్ట్రాలు, ఒకటి అటో ఇటో అయితే కావచ్చు, ఉరుకులు పరుగులుతో ఉన్నప్పుడే హోలి హడావిడి మొదలయింది.

ఎన్నికల ప్రచారం తీరు మనకు అందరకూ పరిచయమే. హోలి రంగుల రాసక్రీడ కూడా తెలిసిన సంగతే.

రెండూ కలిస్తే ఎలా వుంటుందో ఇంతకుముందు మనకు తెలియదు.

ఈసారి తెలిసింది.

ఎలక్షన్ల రోజుల్లో ప్రచారం జరుగుతుంది. అభ్యర్థులు బయలుదేరి ప్రాపగాండా చేస్తారు. వాళ్ళను బలపరిచేవాళ్ళు ప్రచారంలో పాల్గొంటారు. ఇష్టమైన వాళ్ళు వుంటారు. పిల్లలు వుంటారు. మొత్తం హడావిడిగా వుంటుంది. నగరం గుండెపోటులా కొట్టుకొన్నట్లు వుంటుంది. హోలీరోజూ ఇంతే! కామదహనం చేయాలని వాళ్ళ కోర్కె. పప్పుబెల్లాలు పిల్లల ఇష్టాలు. ఇంటింటికి పోతారు. డబ్బు వసూలు చేస్తారు. కాల్చటానికి పనికివచ్చేవాటిని పట్టుకుపోతారు.

ఎన్నికలవాళ్ళు తిరుగుతారు. వీళ్ళు తిరుగుతారు.

తిరిగారు. వీధులంతా రంగురంగుల కాగితాలు కట్టారు.

వీధులనిండా రంగులు చల్లారు.

గోడలమీద రంగురంగుల బొమ్మలు గీశారు. మాటలు రాశారు.

కొత్త రంగులు కొత్తగా మొదలయిన ఎండలకు చిక్కి బిక్కముఖం వేసుకొని గోడలమీద వేలాడుతున్నాయి.

కామదహనం చందాలు అడగటానికి మామూలుగా వచ్చే పిల్లలు ఓట్లు అడగటానికి వచ్చారు.

కాముణ్ణి దహనం చేస్తామని చెప్పలేదు.

ఫలానావాణ్ణి గెలిపించమని అడుగుతున్నారు.

ఈ పిల్లలు ఒకే జట్టుగా వచ్చేవాళ్లు. ఇప్పుడు రెండు మూడు జట్లుగా వస్తున్నారు.

ఆ జట్టు గెలిపించమన్నవాళ్ళని ఈ జట్టు ఓడించమంటున్నారు.

ఊరికే రావటంలేదు. ఊరేగుతూ వస్తున్నారు.

దొరికిన వాహనం ఎక్కి సైలెన్సర్లు తీసేసి వీథికి శబ్దబ్రహ్మను ఆయాచితంగా దానం చేస్తున్నారు.

పుచ్చుకున్న ఓటరు సిద్ధుడు. లేకపోతే ప్రసిద్ధుడు.

పిల్లలొస్తుంటె చందా అడుగుతారని పర్సులోంచి నోటుతీసి నిలబడితే, ఓటు అడిగి, ఓటు వేయమనే నోటు ఇచ్చి వెళ్ళిపోయారు.

ఒకటి పర్సులో, మరొకటి జేబులో పెట్టుకొని బిత్తరపోయి చూడటమే పనయింది.

పార్కులో మూడు నాలుగు పబ్లిక్ మీటింగులు జరిగాయి.

అన్ని మీటింగులకు వెళ్ళాను. అందరూ అది చేస్తాం, ఇది చేస్తాం, ఏదైనా చేసేస్తాం అని చెబుతుంటే, నెలజీతం సర్దిసర్ది వాడుకొనే మధ్యతరగతి మహాత్ముణ్ణయిన నాకు చాలా భయం కలిగింది.

దేశానికో రాష్ట్రానికో ఒక పర్సు వుంటుంది.

అందులోను కొంత జీతం వుంటుంది. అది సర్ది సర్ది వాడుకొంటే సరిపోతుంది. లేకపోతే అప్పులు తేవాలి. వడ్డీ పెరుగుతుంది.

తీర్చటానికి ప్రాణం పుట్రా నగా నట్రా పోతాయి.

బంగారం ఇంట్లోంచి కనపడకుండా పోతుంది. కొంప దివాళా తీస్తుంది.

ఈ వాగ్దానాలు నిలబెట్టటానికి డబ్బు ఎక్కణ్ణుంచి వస్తుంది ?

రాష్ట్రంకాని కేంద్రంకాని ఈ వాగ్దానాలు నిలబెట్టుకోటానికి ఈ నెలలోనే వెలువడే బడ్జెట్‌లు సామాన్యుణ్ణి మాన్యుణ్ణి చేయటానికి ప్రయత్నిస్తాయి. గొప్ప లోటు

బడ్జెట్లుగా రూపం దిద్దుకొంటాయి. అప్పులు తెచ్చేవిగా మిగులుతాయి. ధరలు పెరుగుతాయి. ఆకలి పెరుగుతుంది.

నాకు భయం పట్టుకొంది. పిల్లలు నాదగ్గర తీసుకోకుండా మిగిల్చిపోయిన నోటును గట్టిగా పట్టుకొని కూర్చున్నాను.

వీధుల్లో ఓటు కేకలు మోగుతున్నాయి. అవి నాకు నోటు కేకలుగా వినబడుతున్నాయి.

ఎన్నికల్లో సామాన్యుల ఓట్లు సంపాదించడానికి చేసే వాగ్దానాలు అన్నీ పాటిస్తే దేశం ఏమౌతుంది ?

ఇప్పుడు వాగ్దానాలు చేస్తూవున్న అన్ని పార్టీల వాళ్ళలోను నీతి నిజాయితీ కనబడుతూ వుంది. అందరూ మాట చెల్లించేటట్లున్నారు. వీళ్ళు అనేమాట తప్పే వాళ్ళయినా మంచిది. లేకపోతే దేశం దివాళా తీయటం ఇన్‌ఫ్లేషన్ విపరీతంగా పెరగటం ఖాయం.

మరి అటువంటి పరిస్థితిలో ఈ జనం సామాన్యులు, మధ్యతరగతి వాళ్ళు, ఉద్యోగస్థులు, బీదాబిక్కీ, సాదాసీదా జనం ఎలా బతుకుతారు ?

నాకు భయంగా వుంది.

పూర్వం కరపత్ర ప్రచారానికి కాలం చెల్లిపోయింది.

ఎవరు చదువుతారు ? అందరూ చదవరు. చదవ లేరు. అందువల్ల ఏం చేయాలి ?

అందరూ చూస్తారు. చదువు రావలసిన పనిలేదు. కళ్ళుంటే చాలు.

ఎవరూ ఎవరికీ తీసి పోలేదు.

కటౌట్‌ల ప్రచారం. కొత్త పద్ధతి.

ఆ ప్రచారం చేస్తున్న పిల్లల్లో కొందరికి హోలీ చేసుకుందామని సరదా పుట్టింది.

కాని, వీలుకాకుండా వుంది.

144 సెక్షను విధించారు. అది అమలులో వుండగా ఎన్నికలు జరిగాయి.

ప్రజాస్వామ్యానికి ప్రబల పరీక్ష.

నోరు మూసుకుని, నలుగురు కలవకుండా ఓటు వేసిరావటం బాగానేవుంది.

ప్రజాస్వామ్యం వర్థిల్లుతూ వుంది.

ఎన్నికలు ముగిశాయి.

రాత్రి వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

హోలీ మంటల్లో వేయటం కోసం పిల్లలు కట్టెలు సంపాదించుకొంటారు మోయగలిగిన వాటిని మోసుకుపోతారు.

అర్ధరాత్రి పది మందీ పోగయ్యారు. ఒక కటౌట్‌ను పడేశారు.

కట్టెలు లాగారు.

తీసుకుపోలేక పోయారు. కటౌట్‌లు బరువుగా వున్నాయి.

నిప్పు పెట్టారు. కట్టెలు అంటుకొంటున్నాయి.

మంట లేచింది. అరుపులు వినబడ్డాయి.

వీధి అంతా గోల.

కటౌట్ కాళ్ళు కాలిపోయాయి. కడుపు కాలింది. చేతులంటుకున్నాయి. పొగ కమ్మినా ముఖం మాత్రం కనబడుతూ వుంది జనం పోగయ్యారు. అటూ ఇటూ పరుగెత్తారు.

మంటలార్పారు. ఈ కటౌట్ ముఖం మాత్రం మిగిలిపోయింది. కట్టెలు చాలా భాగం కుప్పపడి వున్నాయి.

వీళ్ళు కోపంగా వున్నారు. మంట పెట్టిన వాళ్ళు దొరికితే పెద్ద కొట్లాట అవుతుంది. అందరికీ భయంగా వుంది.

వాళ్ళు దొరకలేదు.

వాళ్ళందరినీ దాచిపెట్టినట్లుగా నిలబడి ఉంది కటౌట్.

దీనికి అదేగతి పడితే బాగుండునని ఎవరో అన్నారు.

ఎవరో సర్దారు.

అందరూ వెళ్ళిపోయారు.

ఆరోజు సాయంకాలానికి ఎన్నికల ఫలితాలు తెలిశాయి.

విజయోత్సాహం ప్రదర్శించటానికి పర్మిషన్ లేక ఊరేగింపు జరుగలేదు.

కటౌట్‌ల వీధి నిర్మానుష్యంగా ఉంది.

అర్ధరాత్రి నిటారుగా నిలబడ్డ కటౌట్ నేలకొరిగింది.

మంట లేచింది.

ఈ పదిమందీ ఈ పనిలో ఉంటే ఆ పదిమంది కర్రలు ఇనుప ఊచలు తీసుకుని ఉరుకుల పరుగులతో వచ్చేరు.

వాళ్ళను చూచి వీళ్ళు పరుగు లంకించుకున్నారు.

ఆరోజు హోలి.

రంగు నీళ్ళు జల్లుకుంటున్నారు.

రంగు నీళ్ళు జల్లుతున్నారు.

రంగు కాగితాలు ఎగరేస్తున్నారు. రంగు రంగుల రిబ్బన్లు విసురుతున్నారు.

నగరమంతా ఎన్నికల ఆనందం, హోలీ ఆనందం కలిసి అందిస్తూ వుంది.

యువతీ యువకుల ఉత్సాహం పట్టనలవి కాకుండా వుంది.

అది శృంగారం అనాలో, సరదా అనాలో తెలియని సంగతిగా వుంది.

ఎవరంతట వాళ్లు ఎవరినో వెదుకుతూ తిరుగుతూ ఉన్నట్లుగా కనిపించారు.

హోలీ పండుగ సందర్భంగా పిల్లలకు బొరుగులు పంచిపెట్టారు.

మరమరాలు ఎగరేసుకుంటూ శవం వెంట పోయినట్లు పోలోమని పోతున్నారు.

కాముణ్ణి కాల్చబోయేముందు శవవాహకులుగా బయలుదేరారు.

కొంతమంది కామన్న బంధువులు ఏడుస్తున్నారు.

రంగునీళ్ల చల్లుతున్నారు.

రంగులు ఎగురుతున్నాయి. ఎర్రరంగునీళ్ల సింధూరం-చల్లుతూ ఎవరో ఒకడు పరిడుగెతూ వస్తున్నాడు.

వీళ్ళు తమ బట్టలమీద పడకుండా పరిగెడుతున్నారు. దూరంగా జనం. మసక మసకగా చీకటి పడుతూవుంది.

ఎర్నీళ్ళ మనిషి వస్తుంటే అందరూ పారిపోతున్నారు. అప్పుడు కర్రలు, ఇనపకడ్డీలు పట్టుకొని ఎవరినో వెదుకుతున్న వాళ్ళూవీళ్ళూ ముందుకు వచ్చారు.

ఎర్నీళ్ళ మనిషి వీళ్ళను చూచాడు. ఆగాడు.

వాళ్ళను చూశాడు. తగ్గాడు.

అటుపోబోయాడు. వాళ్ళు ముందుకు వచ్చారు.

ఇటు పరిగెత్త బోయాడు. వీళ్ళు ఉరికారు. వలలోబడ్డ చేపలాగా గిలగిల లాడాడు. పిల్లలు తరుముతున్న ఎలుకలాగా అటూఇటూ తిరిగాడు. పరుగెత్తాడు.

వాళ్ళూ కర్రలెత్తారు.

వీళ్ళూ కట్టెలెత్తారు.

ఇనుప కడ్డీలు ఆకాశంలో అల్లల్లాడుతున్నాయి.

కర్ర పడింది.

కట్టె పడింది.

కడ్డీ పడింది.

తల పగిలింది. రక్తం చిమ్మింది.

ఎర్నీళ్ళు పిచికారి గొట్టంలో నుంచి కొట్టినట్లయింది.

ఫౌంటెన్ లోంచి పొంగి నట్లుంది.

రంగునీళ్ళు చల్లు కుంటున్నారు. రంగు కాగితాలు ఎగరవేస్తున్నారు.

రంగుల హోలీ రంగం హోరెత్తి పోతూ ఉంది.

తల నేలమీద పడింది. తనువు ప్రతి అంగుళంలో కర్రదెబ్బ, కట్టెదెబ్బా, కడ్డీ దెబ్బా పడింది.

కటౌట్‌లు బొమ్మలు. అవి కదలవు.

-2

ఈ కదిలే బొమ్మ కదలకుండా పడిపోయింది. పడి ఉంది.

కట్టెలు లేవు.

కర్రలు లేవు.

ఇనుప కడ్డీలు లేవు.

అవి తెచ్చిన మనుషులూ లేరు. పిల్లలు వోలోమని వోతున్నారు.

కటౌటుల కట్టెలు కుప్ప వోశారు. దాని మీద కాలకుండా మిగిలిపోయిన కటౌట్‌ల ముఖాలు పడేశారు.

ఇంతెత్తు గుట్ట తేలింది. దానిమీద రంగునీళ్ళ బొమ్మ, కదలకుండా పడి వున్న బొమ్మ, చేరింది.

కామన్న పండుగ మొదలయింది.

నిప్పు పెట్టారు.

మంట లేచింది.

కాళ్ళు కాలాయి. చేతులు కాలాయి. వళ్ళు కాలింది. మంటలు లేస్తున్నాయి.

దూరంగా ఊరేగింపు వస్తూ ఉంది.

మంటను చూచి ఆగింది. హోలీ మంట అనుకొంటూ సాగింది.

మూడు తలలూ అంటూ కొన్నాయి.

కపాలాలు ప్రేలాయి. కపాల మోక్షమయింది.

కాముడు కాలి పోయాడని పిల్లలంతా చప్పట్లు కొట్టి కేకలు పెడుతున్నారు.

ఊరేగింపు మోత ముమ్మరంగా ఉంది. కామదహనం మంట బూడిద అవుతున్నప్పుడు ఊరేగింపు దూరమవుతూ ఉంది.